తీరంలో 'మందు పార్టీలు'

- పిల్లల పార్కు వద్దే మందుబాబుల మకాం
- చోద్యం చూస్తున్న పోలీసులు


తీరంలో కొబ్బరి చెట్ల వద్ద మందుబాబులు తాగి విడిచి పెట్టిన మద్యం సీసాలు

బీచ్ రోడ్డు: సాగరతీరం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. సంద్రం చెంతన అందం కోసం ఏర్పాటు చేసిన కొబ్బరి చెట్ల వద్ద మందుబాబులు యథేచ్ఛగా పార్టీలు చేసుకుంటున్నారు. తాగి పడేసిన సీసాలు ఉదయం వేళ సందర్శకులకు దర్శనమిస్తున్నాయి. కొందరు ఆకతాయిలు ఖాళీ మద్యం సీసాలను పగులుగొట్టి అక్కడే పడేస్తున్నారు. ఆ పెంకు గుచ్చుకుని సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పిల్లల పార్కు వద్దే తిష్ట

వైఎంసీఏ ఎదురుగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన చిల్డ్రన్ ఎబిలిటి పార్కు వద్ద మందుబాబులు తిష్ట వేస్తున్నారు. పార్కును ఆనుకొని ఉన్న కొబ్బరి చెట్ల వద్ద మందు పార్టీలు చేసుకుంటున్నారు. అక్కడే మద్యం సీసాలను విడిచి పెట్టేస్తుండడంతో పార్కుకు వచ్చే పిల్లలతో పాటు తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సాయంత్రం 7 గంటలు దాటితే భయం భయం

సాధారణంగా బీచ్‌కు సాయంత్ర సమయంలో సందర్శకులు వస్తుంటారు. వైఎంసీఏ ఎదురుగా ఉన్న బీచ్, లైట్ హౌస్ వైపు సాయంత్రం 7 గంటల దాటిన తరువాత వెళ్లాలంటే సందర్శకులు హడలిపోతున్నారు. ఈ ప్రాంతం మొత్తం చీకటిగా ఉండడంతో మందుబాబులకు అనుకూలంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయాలని సందర్శకులు కోరుతున్నారు.

జూలో మద్యం వ్యవహారంపై తూతూమంత్రంగా చర్యలు


జూ పార్కు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూపార్కులో ఇటీవల జరిగిన మద్యం వ్యవహారంపై జూ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారు. వన్యప్రాణులు సంరక్షణలో ఉన్నవారు మద్యం మత్తులో జోగుతుంటే అధికారులు లైట్ తీసుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బయటకు పంపించి మద్యం తీసుకురమ్మన్న యానిమల్ కీపర్‌ను వదిలేసి మద్యం తీసుకొచ్చిన ఎన్ఎంఆర్(తాత్కాలిక) ఉద్యోగిపై చర్యలు తీసుకుని చేతులు దులుపేసుకున్నారు. ఇటీవల జూలో ఏసీ–1 పరిధిలో ఉండే ఓ కీపర్ మధ్యాహ్నం సమయంలో ఒక ఎన్ఎంఆర్‌ను బయటకు పంపించి మద్యం తెప్పించుకున్నాడు. సాధారణంగా ఉదయం విధులకు వెళ్లిన సిబ్బంది మళ్లీ విధులు ముగిసిన అనంతరం సాయంత్రం మాత్రమే బయటకు రావాలి. మధ్యలో అత్యవసర సమయంలో అవసరమైన వారిని జూ అధికారుల అనుమతితో మాత్రమే బయటకు పంపిస్తారు. ఇక్కడ మాత్రం అలా కాకుండా కొందరు శాశ్వత యానిమల్ కీపర్లు చక్రం తిప్పుతున్నారు. వారికి అవసరమైనప్పుడు ఎన్ఎంఆర్‌లను బయటకు సొంత పనుల కోసం పంపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే ఇటీవల ఓ ఎన్ఎంఆర్ కీపర్ మధ్యాహ్నం సమయంలో శాశ్వత కీపర్ కోసం మద్యం తీసుకొస్తూ జూ ద్వారం వద్ద సెక్యూరిటీ, ఇతర సిబ్బందికి దొరికిపోయాడు. దీనిపై జూ అధికారులు ఆరా తీశారు. మద్యం ఎవరు తీసుకురమ్మన్నారో అధికారులకు తేటతెల్లమైంది. అయినా మద్యం బాటిల్ తీసుకొచ్చిన ఆ ఎన్ఎంఆర్‌ను మాత్రమే విధుల నుంచి తొలగించి, అసలు బాధ్యుడ్ని వదిలేయడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా క్యూరేటర్‌కు తెలియకుండా కింది స్థాయి అధికారులే చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల సుమారు ఆరు నెలలు పాటు సెలవులో ఉన్న క్యూరేటర్ నందనీ సలారియా వారం క్రితం మళ్లీ విధుల్లో చేరారు. ఈ మద్యం వ్యవహారంపై స్పందించిన క్యూరేటర్ జూలో కఠిన చర్యలు చేపడతామన్నారు. మద్యం లోపలకు ఎలా వచ్చిందో పూర్తిగా పరిశీలిస్తామన్నారు. ఇక నుంచి ఇలాంటివి జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలపై సమావేశం నేడు

మద్దిలపాలెం: రాష్ట్రంలో యూనివర్సిటీ బోధనేతర సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలు అమలు చేయాలని కోరుతూ సోమవారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరవుతారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆచార్య అల్లం అప్పారావు మృతికి సంతాపం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుడు అల్లం అప్పారావు మృతికి యూపీఎస్‌సీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అర్ధ శతాబ్దంకు పైగా తనకు ఆచార్య అల్లం అప్పారావుతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భగా గుర్తు చేసుకున్నారు. విభిన్న పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించి పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు.

'రూ.2వేలు నోటు రద్దు అనాలోచిత నిర్ణయం'

మద్దిలపాలెం: ఆర్‌బీఐ ఆకస్మికంగా రూ. 2 వేలు నోటు రద్దు చేయడం అనాలోచిత నిర్ణయమని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగదు ఆధారిత లావాదేవీలు జరిపే వ్యక్తులు, సంస్థల వద్ద ఈ నోట్లు పెద్ద సంఖ్యలో ఉంటాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల దృష్టికి మరల్చాలనే ఇలా చేస్తున్నారని విమర్శించారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సమంజసంగా లేదన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నిర్ణయం తీసుకోవాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కొమ్మాది: విద్యార్థి దశ నుంచి పిల్లలు క్రీడల్లో కూడా రాణించాలని వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఎస్సీ సెల్ ఇన్‌చార్జి సియాద్రి కనకరాజు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలో పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ నర్సింగరావు నేతృత్వంలో సంవత్సరం పాటు కరాటేలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ఆయన అందజేశారు. విద్యార్థులు బాల్యం నుంచే కృషి, పట్టుదల అలవరచుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, స్థానిక నాయకులు గుంటుబోయిన సంజీవ్ యాదవ్, గుంటుబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

అమెరికన్ వర్సిటీలతో కలిసి ఏయూ ఎంఎస్ కోర్సులు

మద్దిలపాలెం: అమెరికన్ యూనివర్సిటీలతో కలిసి రెండు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సహకార మాస్టర్ ప్రొగ్రాంలను ప్రారంభించినట్టు ఏయూ వీసీ ఆచార్య పీజీవీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. స్క్రాంటన్ వర్సిటీలో రెండేళ్ల ఎంఎస్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సును ఏయూలో ఆన్‌లైన్‌లో ఏడాది, యూఎస్‌లో ద్వితీయ సంవత్సరం చదివే అవకాశం ఉంటుందన్నారు.

- ఎంఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌ను మిస్సోరి స్టేట్ యూనివర్సిటీతో కలిసి ఏయూ సంయుక్తంగా అందిస్తుందని వీసీ తెలిపారు. ఇక్కడ విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీలో ఆన్‌లైన్‌లో మొదటి సంవత్సరం, యూఎస్‌ఏలో రెండో సంవత్సరం చదువుతారన్నారు. రెండూ స్టెమ్‌ల కోర్సుల వల్ల విద్యార్థులు ఎంఎస్ కోర్సులను పూర్తి చేసిన తర్వాత మూడేళ్లపాటు ఓపీటీకి అర్హులన్నారు. వారు యూఎస్‌ఏలో పని చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 94401 91968 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వాల్తేర్ డిపో పరిశీలన


డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఎంవీపీ కాలనీ: డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు ఆదివారం వాల్తేర్ డిపోను సందర్శించారు. డిపోలోని పలు యూనిట్లను పరిశీలించి డ్రైవర్లు, కండక్టర్లతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రైనింగ్‌కు అనుగుణంగా డ్రైవర్లు, కండక్టర్లు మెయింటెనెన్స్ పక్కాగా చేయాలని, మెకానిక్‌లు బస్సుల కండిషన్‌ను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ప్రయాణికులకు అందించే సేవల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ అప్పలరాజు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతంపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఎంవీపీ కాలనీ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆదివారం కూడా శిక్షణ కొనసాగింది. నిపుణులైన అధ్యాపకులు సంస్కృతంపై అవగాహన కల్పించారు. సంస్కృతం, హిందీ భాషాలపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆటవిడుపుగా లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడాలో 26 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు.. పాత్‌వేలు వదిలేశారు.!


కైలాసగిరిపై మట్టి మార్గంతో ఉన్న రాతి శిల పార్కు

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై రాతి శిల పార్కు విగ్రహాలకు మాత్రమే పరిమితమైంది. ఈ పార్కులో విగ్రహాల మధ్య గతంలో ఫుట్‌పాత్‌లు ఉండేవి. ఇటీవల నగరంలో జరిగిన జీ–20 సదస్సులో పర్యాటక కేంద్రాలు అభివృద్ధిలో భాగంగా వీఎంఆర్‌డీఏ కైలాసగిరిపై పలు పనులు చేపట్టింది. ఇందులో భాగంగా ఇక్కడ రాతి శిల పార్కులో గతంలో ఉన్న ఫుట్‌పాత్‌లు తొలగించి విగ్రహాల మధ్యన ఖాళీ స్థలాల్లో పూల మొక్కలు నాటారు. సందర్శకులు నడవడానికి వీలుగా కొత్తగా పాత్‌వేలు నిర్మించాల్సి ఉంది. కానీ ఇప్పటికీ పాత్‌వేలు నిర్మించకుండా వదిలేశారు. దీనివల్ల ఈ పార్కు లోపల వేసిన మట్టిపై రాళ్లు పైకి తేలడంతో సందర్శకులు నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో సందర్శకులు లోపలకు వెళ్లకుండా రోడ్డు మీద నుంచే చూసుకుంటూ వెళ్లిపోతున్నారు. ఇక్కడ నడవడానికి వీలుగా పాత్‌వేలు నిర్మించి రాతి విగ్రహాలను దగ్గరుండి తిలకించే అవకాశం కల్పించాలని వీఎంఆర్‌డీఏ అధికారులను సందర్శకులు కోరుతున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు చేస్తున్న అర్చకులు


కలశాలకు పూజలు చేస్తున్న గ్రామ సేవా సంఘం సభ్యులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని కోదండరామయ్య సహిత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి అర్చకులు విష్వక్సేన, పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ, రుత్విక్ వరుణుల మండపారాధన నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శత కలశ అభిషేకం జరిపారు. విశేష హోమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం గోవింద నామ స్మరణతో మార్మోగిపోయింది. భక్తులకు మజ్జిగ, ప్రసాదం అందజేశారు.

ఉద్యానవనం సందర్శన


ఉద్యానవనంలో అధ్యాపకులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని విద్యభారతికి చెందిన అధ్యాపకులు ఆదివారం సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 పాఠశాలల నుంచి 80 మంది అధ్యాపకులు ప్రకృతి వనాన్ని సందర్శించారు. టీచర్ ట్రైనింగ్ పొందుతున్న వీరంతా జీవ వైవిధ్య వనాన్ని సందర్శించి విశేషాలు తెలుసుకున్నారు. వందలాది జాతులకు చెందిన వృక్షాలు, వాటి విశిష్టతను పార్క్ నిర్వాహకుడు మంథా రామమూర్తి వివరించారు.

చలివేంద్రంలో సబ్జా నీరు పంపిణీ


ప్రయాణికులకు సబ్జా నీరు అందిస్తున్న గోమాత సేవా ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం: గోమాతా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్త వెంకోజీపాలెం బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం సబ్జా గింజల నీరు పంపిణీ చేశారు. గత నెల 24వ తేదీ నుంచి కొత్త వెంకోజీపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఈ చలివేంద్రం కొనసాగుతోంది. మరో నెల రోజుల పాటు కొనసాగిస్తామని ట్రస్ట్ వ్యవస్థాపకుడు తిలోచన తెలిపారు.

ట్రాఫిక్ ఆంక్షలతో సందర్శకులకు అవస్థలు

బీచ్ రోడ్డు: ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఆకాంక్షలతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం కావడంతో నగర వాసులు పెద్ద సంఖ్యలో తీరానికి వచ్చారు. అయితే సాయంత్రం ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీ ఉండడంతో ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడు కార్లను బీచ్‌రోడ్డులోకి వెళ్లకుండా నిషేధం విధించారు. దీంతో కారులో వచ్చిన సందర్శకులు నడుచుకుంటూ తీరానికి వెళ్లారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులతో వచ్చిన వారు నడుచుకుంటూ వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. ఎటువంటి ముందుస్తు సమాచారం లేకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

తగరపువలస: స్థానిక జాతీయ రహదారిపై సంగివలస వద్ద శనివారం మధ్యాహ్నం రోడ్డు దాటుతూ వలందపేటకు చెందిన మొక్క శ్రీనివాసరెడ్డి(36) అనే పెయింటర్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనివాసరెడ్డి ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైపు వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా తగరపువలస నుంచి విశాఖ నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడిపోయిన శ్రీనివాసరెడ్డి ఎడమచేయి, నడముకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆయన ఇంటికి ఫోన్ చేయగా వచ్చిన కుటుంబ సభ్యులు అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స అనంతరం సాయంత్రం 7.30కు డిశ్చార్జ్ చేశారు. దీంతో ఇంటికి వెళ్లిపోయిన శ్రీనివాసరెడ్డి ఆరోగ్యం గంటలోనే విషమించడంతో మళ్లీ అదే ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాసరెడ్డి డోర్ పాలిషింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతనికి భార్య లక్ష్మి, 9 ఏళ్ల కుమారుడు హేమ నిఖిల్, 6 ఏళ్ల కుమార్తె దీక్షిత ఉన్నారు. శ్రీనివాసరెడ్డి మృతితో వలందపేటలో విషాదం నెలకొంది.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు


శిల్పారామంలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం(జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన శ్రీ నటరాజ నాట్య మండలిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమదైన రీతిలో కూచిపూడి, జానపద నృత్యాలు అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వినాయక స్తుతికి ప్రదర్శించిన కూచిపూడి నృత్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాకారులు వాసుదేవ్, స్వాతి, స్వప్న, ఖాస్మిత, శ్రీలక్ష్మి, ఈక్షిత, సుదాక్ష, స్నేహ, హాసిని, అక్షయ, స్వాతి తదితర కళాకారులు పాల్గొనగా ఈ.బిందుకామేశ్వరి నృత్య దర్శకత్వం వహించారు.

ఘనంగా ఎర్నిమాంబ జాతర


మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు


ఆలయం వద్ద భక్తుల సందడి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు పరిధి జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి జాతరను దేవదాయ శాఖ, ఆయా సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ దర్శనాలకు క్యూలైన్లలో బారులు దీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ, ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయ నేతృత్వంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరం నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను, సుమారు 35 అమ్మవారి ప్రతిమలను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేవదాయశాఖ ఈవో బాబా, ఆయా సంఘాల ప్రతినిధులు, ఆలయ సిబ్బంది జాతరను పర్యవేక్షించారు.

నేరాలకు దూరంగా ఉండండి

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, ఎలాంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని హితవు పలకారు. కార్యక్రమంలో ఎస్ఐలు మోహన్‌రావు, గౌరి, వెంకటరావు పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో.. : ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ చేశారు. రౌడీ షీటర్ల దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. మంచిగా జీవించాలని సీఐ సూచించారు. కౌన్సిలింగ్ అనంతరం సిబ్బంది రౌడీ షీటర్లను ఇంటి వద్ద అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధరేంద్ర, అప్పలరాజు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం


మావూరి వీరమణి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మావూరి వీరమణి కుటుంబంతో కలిసి బర్మాక్యాంప్‌లో నివసిస్తోంది. నర్సింగ్ మొదటి సంవత్సరం పూర్తయింది. ఈ నెల 15న తల్లిదండ్రులతో కాలేజీకి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో యువతి బావ నరేంద్ర కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును ఏఎస్ఐ ఆదిరాజు దర్యాప్తు చేపట్టారు.

వాచ్‌మెన్ మిస్సింగ్..

కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పట్టాభిరెడ్డితోటకు చెందిన వెన్నెల సింహాచలం ఈ నెల 14వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదు. సదరు వ్యక్తి గతేడాది వరకు ఏలూరులో ఉండి, విశాఖకు వచ్చాడు. పట్టాభిరెడ్డి తోటలో కొత్తగా కడుతున్న అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తుంటారు. అతడి అన్నయ్య వెన్నెల రామారావు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాశరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన లాబా గడబ

గోపాలపట్నం: గుర్తు తెలియని రైలు నుంచి జారిపడిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన వ్యక్తి వ్యక్తి మృతి చెందాడు. కొత్తపాలెం రైల్వే బ్రిడ్జ్ వద్ద చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి దువ్వాడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం జయంతిగిరికి చెందిన లాబా గడబ(39) గుర్తు తెలియని ట్రైన్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడడంతో మృతి చెందాడు. దువ్వాడ రైల్వే పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తికి సంబంధించినవారు దువ్వాడ రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


కుళాయిలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్ నగర్‌లో 2013 నుంచి స్థానికులను వేధిస్తున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఏళ్ల తరబడి వేధిస్తున్న ఈ సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి స్థానిక కార్పొరేటర్ లొడగల అప్పారావు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయించారు. వాటిని కార్పొరేటర్ అప్పారావు ఆదివారం ప్రారంభించడంతో స్థానిక మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మంచి నీరు సుమారు 500 కుటుంబాల దాహం తీర్చుతుందన్నారు. కార్యక్రమంలో ఉప్పలూరి గోపి, మాదు చంటి, లొడగల రామ్మోహన్, రాంబాబు, అప్పలస్వామి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.